క్లుప్తంగా

అర్ధవీడు మాజీ సర్పంచ్ రాంరెడ్డి మృతి


మృతి చెందిన మాజీ సర్పంచ్ రాంరెడ్డి

అర్ధవీడు(బేస్తవారి పేట): అర్ధవీడు మాజీ సర్పంచ్ మునగాల రాంరెడ్డి(89) గురువారం అర్ధవీడులోని స్వగృహంలో మృతి చెందారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో పేదలకు సహాయం చేసి, మంచికి మారుపేరుగా నిలిచారని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు కొనియాడారు.

అనుమతి లేని కట్టడాలు నిలిపివేత


అక్రమకట్టడాన్ని నిలిపివేస్తున్న కమిషనర్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పాములపల్లె రోడ్డులో అనధికారికంగా నిర్మిస్తున్న భవనాన్ని కమిషనర్ డి.వెంకటదాసు గురువారం అడ్డుకున్నారు. నగర పంచాయతీలో టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి అనుమతి తీసుకున్నాకే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అనుమతులు లేకుండా నిర్మిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కోటగడ్డ వీధిలో సచివాలయంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందించేలా సిబ్బంది పనిచేయాలని సూచించారు.

14న సుకృతానందాజీ స్వామి రాక

గిద్దలూరు రూరల్: పట్టణంలోని శ్రీరామక్రిష్ణ ధ్యానమందిరం, మండలంలోని వెల్లుపల్లె గ్రామంలో రామక్రిష్ణ ధ్యానమందిరాలను ఈ నెల 14న తిరుపతిలోని రామకృష్ణ మఠం స్వామి సుకృతానందాజీ మహారాజ్ సందర్శించనున్నట్లు మందిర నిర్వాహకులు పి.హనుమంతారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొని ఆధ్యాత్మిక ఆనందం పొందాలని కోరారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ



నుజ్జునుజ్జయిన సిమెంట్ లారీ ముందు భాగం

బేస్తవారిపేట: మండలంలోని పందిళ్లపల్లె సమీపంలో ఒంగోలు–నంద్యాల హైవే రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టిన సంఘటన గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. కొమరోలు వైపు వెళ్తున ఖాళీ లారీని డ్రైవర్ టాయిలెట్‌కు వెళ్లేందుకు రోడ్డు మార్జిన్‌లో నిలిపాడు. అదే సమయంలో సిమెంట్ బస్తాల లోడుతో తాడిపత్రి వెళ్తున్న లారీ ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొట్టింది. సిమెంట్ లోడ్ లారీ ముందు భాగం నుజ్జునుజ్జయింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

నిధుల విత్‌డ్రాకు

రాజకీయ గ్రహణం



తర్లుపాడు ఎంపీడీఓ కార్యాలయం

> **గ్రామాభివృద్ధికి సహకరించండి**
>
> 
>
> దాదాపు 8 నెలలుగా గ్రీన్ అంబాసిడర్ల వేతనం పెండింగులో ఉంది. సొంత నిధులు వెచ్చించి పనులు చేపట్టాం. అధికారులు అలసత్వం ప్రదర్శించకుండా నిధులు డ్రా చేసేందుకు సహకరించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కోరుతున్నాం.
>
> – పెద్దమస్తాన్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు

- సర్పంచ్‌లకు తప్పని వేధింపులు
- స్వామిభక్తి ప్రదర్శిస్తున్న పంచాయతీ సెక్రటరీలు

తర్లుపాడు: దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్న చందంగా ఉంది తర్లుపాడు మండలంలోని పంచాయతీ అధికారుల తీరు. పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధుల డ్రా విషయంలో అధికార టీడీపీ నేతలకు కొమ్ముకాస్తున్న అధికారులు.. సర్పంచ్‌లను వేధిస్తూ స్వామిభక్తిని ప్రదర్శిస్తున్నారు. పంచాయతీ ఖాతాల్లో నిధులు జమ అయ్యి 2 వారాలు దాటినప్పటికీ కార్మికులకు చెల్లించాల్సిన జీతం, అత్యవసరంగా చేపట్టాల్సిన పనులకు నిధుల విషయమై పంచాయతీ సెక్రటరీలకు సర్పంచ్‌లు వివరించినప్పటికీ వారు పెడచెవిన పెట్టారు. దీంతో సొంత డబ్బు వెచ్చించి సర్పంచ్‌లు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టగా అధికారులు ఆ బిల్లులకు ఎంబుక్ చేయడం లేదు. దీనికితోడు పారిశుధ్య కార్మికుల జీతం నెలలుగా పెండింగులో ఉంది. వర్షాకాలం కావడంతో నిధులు లేక పంచాయితీల్లో పారిశుధ్య పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. ప్రజలు డెంగ్యూ, మలేరియా జ్వరాలతో మంచానపడుతున్నారు. కానీ ఇవేవీ పంచాయతీ అధికారులకు పట్టడం లేదు.

నిధుల డ్రాపై రాజకీయ జోక్యం?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విడుదలైన కేంద్ర నిధులు కావడంతో పంచాయతీల్లో తమ పెత్తనం కోసం స్థానిక టీడీపీ నాయకులు నిధులు డ్రా చేసేందుకు వీల్లేదంటూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీనికితోడు కొందరు పంచాయతీ సెక్రటరీలు అధికార పార్టీ నేతల మెప్పు కోసం.. మరికొందరు పరపతి కోసం.. గ్రామాభివృద్ధిని పక్కనపెట్టారు. కూటమి ప్రభుత్వంను ఎన్నుకున్న ప్రజలే తమనూ ఎన్నుకున్నారని, ఇటువంటి కక్ష సాధింపు చర్యలు ఎన్నడూ చూడలేదని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వినాయకా.. సెలవిక..


మార్కాపురం : నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు


రామాపురంలో నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మార్కాపురం: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహాలు గురువారం నిమజ్జనానికి బయలుదేరాయి. బుధవారం రాత్రి కొన్ని విగ్రహాలు, గురువారం ఉదయం మరికొన్ని విగ్రహాలను కమిటీ సభ్యులు గులాం చల్లుతూ, తీన్మార్ డప్పులతో సందడి చేస్తూ ఊరేగించారు. కంభంరోడ్డు, బ్రహ్మంగారి గుడి, కమలా టౌన్‌షిప్ తదితర ప్రాంతాల్లో విగ్రహాలను ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జనంలో శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానం చైర్మన్ పెనుకొండ కేశవరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ పిచ్చిరెడ్డి, నిర్వాహకులు కె.శ్రీకాంత్, సుబ్రమణ్యం, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్ఎస్ నగర్‌లో ఏర్పాటు చేసిన సంతాన విఘ్నేశ్వరస్వామి విగ్రహం వద్ద గురువారం చిన్నారులు కోలాటం ప్రదర్శించారు. పాటల పోటీలు నిర్వహించారు. శుక్రవారం ఉట్టికొట్టే పోటీ, శనివారం అన్నదానం, లక్కీడ్రా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గోపాల్, అజయ్, వంశీమోహన్, శ్రీకాంత్‌లు తెలిపారు. మెయిన్‌బజారులో గణనాథునికి విశేష పూజలు నిర్వహించారు.


గొట్లగట్టు హరిజన కాలనీలో..


మార్కాపురం : కోలాటంలో పాల్గొన్న చిన్నారులకు చిరు సత్కారం

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని రామాపురంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆరు రోజులపాటు విశేష పూజలందుకున్న వినాయకునికి గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. శోభాయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనగా నిమజ్జన ఉత్సవం కనుల పండువగా సాగింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కసిరెడ్డి రమణారెడ్డి, ప్రెసిడెంట్ కసిరెడ్డి కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో వినాయకుని విగ్రహాలను ఆరవ రోజు గురువారం వైభవంగా నిమజ్జనం చేశారు. గొట్లగట్టు హరిజన కాలనీ వాసులు అత్యంత భక్తి శ్రద్ధలతో వినాయకునికి పూజలు చేసి నిమజ్జానానికి తరలించారు. ఊరేగింపులో యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

దశదినకర్మకు హాజరైన మాజీ ఎమ్మెల్యే అన్నా


చంద్రమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు

పొదిలి రూరల్: పొదిలి మండలం మాదాలవారిపాలెం మాజీ సర్పంచ్ మీగడ చంద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి స్వగ్రామంలో గురువారం నిర్వహించిన దశదినకర్మకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి అన్నా వెంకట రాంబాబు హాజరయ్యారు, చంద్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాదాలవారిపాలెం సొసైటీ అధ్యక్షుడు అనికాళ్ల ఈశ్వర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గుంటూరి నాగిరెడ్డి, పిచ్చిరెడ్డి, చిన్న నారాయణరెడ్డి, పులిగొర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థికసాయం


చెక్కు అందిస్తున్న ఎస్వీఎల్ తదితరులు

మార్కాపురం: విజయవాడ వరద బాధితులకు మార్కాపురం పట్టణానికి చెందిన విశ్రాంత అధ్యాపకుడు ఎస్వీఎల్ ఆధ్వర్యంలో 1,12,216 రూపాయలు సేకరించి విజయవాడలోని అక్షయపాత్ర ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్వీఎల్ మాట్లాడుతూ మార్కాపురం పట్టణంలోని మానవతా స్వచ్ఛంద సంస్థ, ఆపోపా(ఆర్యవైశ్య ప్రొఫెషనల్ అండ్ అఫీషియల్స్), రిలాక్స్ గ్రూప్, మార్కాపురం అఫీషియల్స్ గ్రూప్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి వరద బాధితులకు తమవంతు బాధ్యతగా అందజేశామన్నారు. కార్యక్రమంలో ప్రతాప్, సీహెచ్ సుబ్బారావు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సీపీఐ విరాళం

మార్కాపురం టౌన్: విజయవాడ వరద బాధితులకు అందించేందుకు సీపీఐ మార్కాపురం శాఖ రూ.25 వేల రూపాయలు విరాళం సేకరించినట్లు నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య గురువారం తెలిపారు. ప్రజాసమస్యలపై పోరాటం చేస్తూనే మరోవైపు తమ పార్టీ విపత్తు సమయంలో సేవా కార్యక్రమాల్లో ముందుటుందని పేర్కొన్నారు. విరాళాల సేకరణలో తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్షుడు రామిరెడ్డి, కరాటే మాస్టర్ శ్రీనివాసరెడ్డి, కోయదొరల ప్రతినిధి అల్లూరయ్య తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

సీపీఎం నేత సీతారాంకు ఘననివాళి


సీతారాం ఏచూరి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మార్కాపురం: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి గురువారం రాత్రి స్థానిక పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. పార్టీ నాయకులు రఫీ మాట్లాడుతూ.. నమ్మిన సిద్ధాంతం కోసం సీపీఎంలో చేరిన ఏచూరి తుది శ్వాస వరకూ అదే పార్టీలో కొనసాగారని పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిన సీతారాం ఆశయాల కోసం పోరాడుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.బాలనాగయ్య, జవ్వాజి రాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎన్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పుస్తకాలు పంపిణీ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న పిచ్చయ్యయాదవ్, ఉపాధ్యాయులు

గిద్దలూరు రూరల్: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు యశ్వంత్ ఎడ్యుకేషన్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు మొర్రి పిచ్చయ్యయాదవ్ తన సొంత నిధులతో గురువారం పంపిణీ చేశారు. నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పోటీ పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌తో పాటు ఫీజును పిచ్చయ్యయాదవ్ చెల్లించడం అభినందనీయమని ఉపాధ్యాయులు కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరలక్ష్మమ్మ, జనార్దన్‌రెడ్డి, బాలసుందరం, ప్రమీలనారిశ్రీ, పీరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీని పరిశీలించిన హౌసింగ్ ఈఈ


హౌసింగ్ కాలనీ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఈఈ, ఎంపీడీఓ

త్రిపురాంతకం: జగనన్న గృహ సముదాయంలో నిర్మాణంలో ఉన్న పక్కా గృహాలను ఈఈ దాశరథశర్మ పరిశీలించి లబ్ధిదారులకు తగిన సూచనలు చేశారు. త్రిపురాంతకం జగనన్న కాలనీలో ఆప్షన్ 3 కింద కాంట్రాక్టర్ ద్వారా నిర్మాణం జరుగుతున్న గృహ నిర్మాణాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ నిర్మాణాలను నాణ్యంగా నిర్మించాలని సూచించారు. అదే విధంగా నీటితో బాగా క్యూరింగ్ చేయాలన్నారు. నిర్మాణ పనులు జరిగే సమయంలో లబ్ధిదారులు అందుబాటులో ఉండి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలన్నారు. లబ్ధిదారులకు 90 రోజులు పనిదినాలు త్వరితగతిన కల్పించాలని ఎంపీడీఓ వరప్రసాద్, ఏపీఓ సుజాతలను ఆదేశించారు. ఈయన వెంట హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉదయశ్రీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నరసింహారెడ్డి ఉన్నారు.

రామాపురం–లక్ష్మీపురం రోడ్డులో కుంగిన కల్వర్టు


గుంతలమయమైన కల్వర్టు

దొనకొండ: మండలంలోని రామాపురం–లక్ష్మీపురం గ్రామాలను కలుపుతూ మార్కాపురం వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డు చిల్లచెట్లతో నిండిపోయింది. రామాపురం, లక్ష్మీపురం చెరువు కట్ట వద్ద గతంలో నిర్మించిన కల్వర్టు కుంగిపోయింది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, స్కూల్ బస్సులు ప్రతి నిత్యం ఈ రహదారి నుంచి ఉదయం, సాయంత్రం తిరుగుతుంటాయి. కల్వర్టు కుంగి పోవటంతో భయంకరమైన గుంత ఏర్పడి ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యాయి. అధికారులు ఆ దారి నుంచి వెళ్తుంటారు.. వస్తుంటారు. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వర్షం పడిన సమయంలో కల్వర్టు కుంగిన ప్రదేశంలో నీరు నిలబడి ప్రమాదాలకు నిలయంగా మారింది. సంబంధిత అధికారులు కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నీలోఫర్‌బేగం


గిద్దలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య సిబ్బంది

బేస్తవారిపేట:

క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ నీలోఫర్ బేగం పేర్కొన్నారు. గురువారం చెట్టిచర్ల అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. పౌష్టికాహారంతో కలిగే ప్రయోజనాలు, పౌష్టికాహార లోపం వల్ల కలిగే అనర్థాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. తక్కువ ఖర్చుతో తయారు చేసిన పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు.


కంభంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కార్యక్రమంలో వైద్య సిబ్బంది బి.శశికళ, కె.కళాభాషిణి, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.పద్మజ, బి.రెజీనా, ఆయాలు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: గర్భిణులు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సీడీపీఓ బి.జ్యోతి సూచించారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని కోటగడ్డ వీధిలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గర్భిణులు బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుధారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **మార్కాపురం టౌన్:** పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ బుశ్శెట్టి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని గౌతమ్‌కాలేజీ సమీపంలోని ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పోషక లోపంతో అనేకమంది చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని, వారిని గుర్తించి మంచి ఆహారాన్ని అందించాలన్నారు. సీడీపీఓ సుశీల మాట్లాడుతూ.. రోజూ ఆహారంలో ఆకుకూరలు, కాయగూరలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు ధనలక్ష్మి, ఆయాలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కౌన్సిలర్ బుశ్శెట్టి నాగేశ్వరరావు

కంభం: మండలంలోని ఎస్‌పీజీపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సూపర్‌వైజర్ చెంచులక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జశ్వంతి, ప్రశాంతి, వైద్య సిబ్బంది రామలింగేశ్వరి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం

యర్రగొండపాలెం: ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కొలుకుల సెంటర్‌లో ఏర్పాటు చేసిన సిద్ధి వినాయక స్వామి నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీనివాస కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. త్రిదండి చిన్న జీయర్ స్వామి ఆశీస్సులతో మార్కాపురం శ్రీకృష్ణ స్వరాంజలి గోష్టి గురువు పాదర్తి లక్ష్మీమల్లిక శ్రీనివాస కల్యాణం నిర్వహించారు.

ఈ సందర్భంగా దంపతులు కంకణాలు ధరించి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు కుంకుమ పూజా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

రాజీనామా చేయాలని బెదిరిస్తున్నారు

- సబ్‌కలెక్టర్‌కు రేషన్ డీలర్ల ఫిర్యాదు


సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

మార్కాపురం టౌన్: రాజీనామా చేయాలని గత కొద్ది రోజులుగా రెవెన్యూ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని మార్కాపురానికి చెందిన రేషన్ డీలర్లు టి.శ్రీనివాసులు, కె.నాగలక్ష్మి, ఎల్.వెంకటరెడ్డి, ఉమామల్లేశ్వరి, పి.వెంకటేశ్వర్లు, జి.సురేష్ తదితరులు సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్‌కు గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. గత 20 ఏళ్లుగా ఏ పార్టీతో సంబంధం లేకుండా మార్కాపురం పట్టణ ప్రజలకు ప్రభుత్వం అందించిన నిత్యావసర వస్తువులను సకాలంలో పంపిణీ చేస్తున్న తమను ఇలా బెదిరించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ దుకాణాల ద్వారా తాము ప్రజలకు సేవలందిస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ప్రైవేట్ వ్యక్తులు, రెవెన్యూ అధికారులు తమపై ఒత్తిడి తెస్తూ రాజీనామా చేయకుంటే ఇబ్బందులు పడతారంటూ బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. వారి బారి నుంచి తమను కాపాడాలని రేషన్‌షాపులు నిర్వహించుకునే విధంగా అధికారులకు తగు ఆదేశాలు ఇవ్వాలని రేషన్ డీలర్లు కోరారు.